క్లుప్తంగా

భవానీశంకర్‌కు కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ నాయకులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ డబ్బీరు భవానీశంకర్ అంత్యక్రియలు మంగళవారం ఉదయం జరిగాయి. ఈయన ఆదివారం మరణించగా.. కుమారుడు జర్మనీ నుంచి వచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల పాత్ర కీలకం



రికార్డులను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

సంతబొమ్మాళి: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్‌పీడీసీ స్క్రీనింగ్ కార్యక్రమానికి హాజరై రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అవని, సీహెచ్‌ఓ మహాలక్ష్మి, హెల్త్ విజిటర్ కమలమ్మ, ఏఎన్ఎం అప్పలనరసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీమోహనరావు

కవిటి: రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం కవిటి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సర్వేయర్లతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు.

18న శివాజీ విగ్రహావిష్కరణ

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి పంచాయతీ గోపాలపురంలో ఈ నెల 18న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ జరుగుతుందని గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశభక్తిని చాటుతూ అందరూ హాజరుకావాలని కోరారు.

చిన్నారుల బాధ్యత అంగన్‌వాడీలదే



విజేతలతో ఎమ్మెల్యే అశోక్

కంచిలి: చిన్నారుల బాధ్యత తల్లిదండ్రుల కంటే అంగన్‌వాడీ టీచర్లకే ఎక్కువ ఉందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కంచిలిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఇందిర, ఏసీడీపీఓ గోవిందరాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



సరుకులు పంపిణీ చేస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

సంతబొమ్మాళి: మహిళలను పారిశ్రామికంగా ప్రోత్సహించడం లక్ష్యమని ఐసీడబ్ల్యూ డీఎస్ ప్రాజెక్ట్ పి.శ్రీనివాసరావు అన్నారు. హనుమంతునాయుడుపేటలో సమగ్రశిశు మహిళ అభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధికి సహకరిస్తూ వస్తు ఉత్పత్తి శిక్షణ, పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు జి శ్రీనివాసరావు, అల్లు పోలినాయుడు, డివిజనల్ మేనేజర్లు కృష్ణ శ్రీనివాస్, కోఆర్డినేటర్లు చిన్నరెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

● ఆటలు అదుర్స్



పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో విద్యాసంస్థల్లో ఆటపాటల సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు. మంగళవారం కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించగా విద్యార్థినులు హోరాహోరీగా తలపడ్డారు.

-కవిటి

● విజయోస్తు..!



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సర్కారు బడుల్లో విద్యార్థులు ఆట పాటల్లో మునిగిపోయారు. వేడుకలకు మరో రెండు రోజులు సమయం ఉన్నందున మంగళవారం బాలబాలికలకు క్రీడలు, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డొంకూరులో హెచ్‌ఎం సరోజిని పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

- ఇచ్ఛాపురం రూరల్

● స్పందించిన హృదయాలు



పలాసలో ఓ దాత అందించే సాయం తీసుకోవడం కోసం .. పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు దిగి బిడ్డతో పాటు భర్త, భార్య నేలపై నడుచుకుంటూ ప్రయాణించిన వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అమెరికా నుంచి దాతలు స్పందించారు. ప్రస్తుతం కోనసీమజిల్లా రావులపాలెంలో ఉంటున్న సంగిరెడ్డి కనకరాజు, భార్య రమణి దంపతులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో ఉన్న శరత్ మాకల రూ.1.20 లక్షలు ఖర్చుచేసి త్రిచక్రవాహనాన్ని అందించారు.

- కాశీబుగ్గ

ఊరిలోనే ఉపాధి



జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు

- గ్రామాలకు విస్తరించిన జీడి పరిశ్రమలు
- సుమారు 20 వేల మందికి మహిళలకు పని

పలాస :

గతంలో పలాస పట్టణానికి ఆనుకొని ఉన్న మొగిలిపాడు వద్ద 90 జీడి పరిశ్రమలు ఉండేవి. అప్పుడా పరిశ్రమల్లో పనిచేయడానికి మహిళలు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. పలాస రూరల్ మండలంలోని గ్రామాలతో పాటు మందస, వజ్రపుకొత్తూరు ముఖ్యంగా ఉద్దానం ప్రాంతం నుంచి మైళ్లకొద్దీ నడుచుకొని వెళ్లి పరిశ్రమల్లో పనిచేసి తిరిగి రాత్రయితే గానీ ఇళ్లకు చేరే వారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. సొంత గ్రామాల్లోనే జీడి పరిశ్రమలు ఏర్పాటవుతుండటంతో పుష్కలంగా ఉపాధి దొరుకుతోంది. మార్కెట్‌లో జీడిపప్పుకు బాగా డిమాండ్ రావడం, విదేశాల నుంచి కూడా ముడి సరుకుగా జీడి పిక్కలు దిగుమతి కావడంతో గ్రామాల్లో సుమారు 300 పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఇందులో సుమారు 25వేలు మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు.

బాయిలింగ్ చేసిన జీడి పిక్కలను గ్రామాల్లో ఉన్న రేకు షెడ్లల్లో కటింగ్ మిషన్లతో పప్పును వేరు చేస్తున్నారు. ఇలా కిలో పిక్కలు తీస్తే ఒక్కో మహిళకు రూ.33 వరకు ఇస్తున్నారు. జీడిగుడ్డుపై ఉన్న చిన్న తొక్కను తీయడానికి కిలో పప్పునకు రూ.11 వరకు ఇస్తున్నారు. ఈ విధంగా జీడి పప్పును ఉత్పత్తి చేయడానికి 95 శాతం మహిళలే పనిచేస్తున్నారు. మహిళలు పని సామర్థ్యం బట్టి నెలకు రూ.10వేలు వరకు సంపాదిస్తున్నారు.

ఇబ్బందులు తొలిగాయి..



గతంలో జీడి పరిశ్రమల్లో పని చేయడానికి పలాస వెళ్లాల్సి వచ్చేది. ఉదయం వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి చేరేవాళ్లం. అప్పుడు కూలి రేట్లు కూడా తక్కువే. ఇప్పుడు ఊరు దగ్గరే పనిదొరుకుతోంది. ఇప్పుడు సంతోషంగా ఉంది.

- నందేటి పద్మ, జీడి కార్మికురాలు, బొడ్డపాడు కాలనీ, పలాస మండలం

రేట్లు బాగున్నాయి..



మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండేళ్లకు కూలి రేట్లు పెంచుతున్నాం. ఇది పరిశ్రమల దారులకు యూనియన్‌కు మధ్య కుదిరిన ఒప్పందం. ఇప్పుడు రేట్లు బాగున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 25వేల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.

- అంబటి కృష్ణమూర్తి, అధ్యక్షుడు, పలాస కాష్యూలేబర్ యూనియన్

ఇంటర్‌స్టేట్ క్రికెట్ పోటీల విజేతగా ఇచ్ఛాపురం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీసురంగి రాజాక్రీడామైదానంలో నిర్వహించిన ఇంటర్‌స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. భువనేశ్వర్ ఇచ్ఛాపురం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ విజేతగా నిలిచింది. ఎమ్మెల్యే ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ మెంబర్, సభ్యులు ఇలియాజ్ అహ్మద్, బెనర్జి, ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ గౌరవాధ్యక్షుడు దాసరి రాజు, దాతలు ఎం.వెంకటరమణ, బత్తిన నాగరాజు, తవిటయ్య, ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ కోచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



పథకాలు అమలు చేయాలని కోరుతున్న సంఘాల నాయకులు

సోంపేట: ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలు యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని మత్స్యకార, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బారువలో సమావేశం నిర్వహించి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు, రైతులకు ఇంత వరకు సాయం అందకపోవడం దారుణమన్నారు. తక్షణమే పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీపాన గుణవతి, అమర లోకనాథం, పిట్ట పోలయ్య, గోరకడిల్లేశ్వరరావు, ఎర్ర లోకనాథం, తోట నేతాజి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వెటర్నరీ సంఘం నాయకులు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న వెటర్నరీ సంఘం నాయకులు

కోటబొమ్మాళి: వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును మంగళవారం రాష్ట్ర వెటర్నరీ సంఘం నాయకులు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ రాష్ట్ర నాయకులు నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

కాశీబుగ్గలో స్వచ్ఛభారత్



గాంధీ విగ్రహం శుభ్రం చేసి పూలమాల వేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ నాయకుల విగ్రహాల వద్ద మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు వైశ్యరాజు మోహనరాజు, సయ్యద్ మహమ్మద్ ఘనీ, పాలవలస వైకుంఠరావు, ఉర్నాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న నగేష్, గ్రీన్‌ఆర్మీ సభ్యులు

కాశీబుగ్గ: గోగ్రీన్ అంటూ పర్యావరణ హితం కోరుతూ చెన్నై నుంచి పూరి వరకు నగేష్ అనే యువకుడు కాలినడకన ప్రయాణం ప్రారంభించాడు. మంగళవారం పలాస–కాశీబుగ్గ చేరుకోవడంతో పలాస గ్రీన్ ఆర్మీ సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం పలాసలో మొక్క నాటారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, సభ్యులు దిలీప్, సంతోష్, కిషోర్ పాల్గొన్నారు.

దేశభక్తి చాటుకోవాలి



మాట్లాడుతున్న జోహార్‌ఖాన్

ఇచ్ఛాపురం : స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతిఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పట్టణంలోని జ్ఞానభారతి పాఠశాల సీఈఓ జోహార్‌ఖాన్ అన్నారు. మంగళవారం అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమూర్తి, పండా, రషీదాసుల్తానా, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వారధి భగవద్గీత



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

సోంపేట: మానవాళికి విజ్ఞాన వారధి భగవద్గీత అని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి అన్నారు. మాకన్నపురం పంచాయతీ శారదాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదిత్య'కు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంక్



మాట్లాడుతున్న డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు

టెక్కలి: భారత ప్రభుత్వ ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ఉన్నత విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకుల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల స్థానం సంపాదించుకుంది. ఈ మేరకు మంగళవారం కళాశాలలో డైరెక్టర్ వి.వి.నాగేశ్వర్రావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు తదితరులు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ర్యాంకులను ప్రకటించిందని, దేశ వ్యాప్తంగా 18 వేల దరఖాస్తులు చేరుకోగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 13 ఇంజినీరింగ్ కళాశాలలకు ర్యాంకులు వరించాయని వివరించారు. ఇందులో ఉత్తరాంధ్ర నుంచి టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు 201 నుంచి 300 మధ్య ర్యాంకు వచ్చిందన్నారు. దీని వల్ల వివిధ కంపెనీలు ఉద్యోగ అవకాశాల్లో కళాశాల విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తారని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ టి.నాగేషు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ డీన్ సిహెచ్.రమేష్, ఎస్టేట్ మేనేజర్ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

సంతబొమ్మాళి:

2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోత సన్యాసమ్మ అప్పోజీ, లమ్మత నారాయణమ్మ చిన్నయ్య, కోత అబ్బాయి సావిత్రమ్మ స్మారక అవార్డుల పేరిట నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను మంగళవారం అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలతో అప్పిని కీర్తన, రిక్కాడింపుల్, కింజరాపు సాత్విక, లమ్మత భువనకృతి, ఇచ్ఛాపురం పావని, కుష్ట సృజన, పిల్లల శ్యామల, బెవర గాయత్రి, కీర్తన, షణ్ముఖప్రియ, సాత్విక, భూమిక ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వయోజన విద్య విశ్రాంత డైరెక్టర్ మార్పు అమ్మాజీరావు, సంస్థ అధ్యక్షుడు కోత మధు, హెచ్‌ఎం కోత చైతన్య, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ యంత్రాంగం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 2005 నుంచి ఆక్రమణకు గురైన స్థలాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ కేటీ రోడ్డుకు ఆనుకుని ఆంధ్రాబ్యాంకు రోడ్డు మధ్యలో కొంత భాగం ఆక్రణకు గురైంది. పెంట సీతాకల్యాణి కుటుంబ ఆధీనంలో దుకాణాలు నడుపుతుండగా 2005లో కేసు నమోదైంది. పలాస జూనియర్ సివిల్ కోర్టులో వాదనలు అనంతరం మున్సిపల్ స్థలమంటూ శుక్రవారం తీర్పు విడుదలైంది. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. ఈ ఆక్రమణ తొలగింపుతో 48 అడుగుల మేర రోడ్డు వేయడానికి వీలవుతుందని స్థానికులు చెబుతున్నారు.

ఏఓబీలో తనిఖీలు

కాశీబుగ్గ: సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది మంగళవారం మందస మండలం గంధ్రుగాం జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు



తాళ్లభద్ర గేటు వద్ద ఆగిన వాహనాలు

పలాస: పలాస నుంచి కాశీబుగ్గ మీదుగా అక్కుపల్లి వెళ్లే రోడ్డులో ప్రయాణికులకు రైల్వేగేట్ రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని ఉద్దానప్రాంత వాసులకు ఇదే ప్రధానమైన రహదారి. ఈ రోడ్డు నుంచి కాశీబుగ్గకు రాకపోకలు జరుగుతుంటాయి. కాశీబుగ్గకు సమీపంలోని తాళ్లభద్ర వద్ద రైల్వే గేటు ప్రతి పావుగంటకు మూసివేస్తుండటంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ సమస్యను రైల్వే అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం

సోంపేట: భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ బి.అశోక్ అన్నారు. సోంపేట పట్టణానికి చెందిన ఎస్.ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసి బస్టాండ్ వద్ద తల్లిపాల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ పి.శాంతి, పీఓ ఇందిర, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, సూరాడ చంద్రమోహన్, దూసి మధు, మడ్డు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డపాడులో తల్లిపాల వారోత్సవాలు

పలాస: మండలంలోని బొడ్డపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం జలాభిషేకం



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఇచ్ఛాపురం రూరల్: వర్షాలు కురవాలంటూ మండలంలోని లొద్దపుట్టి గ్రామస్తులు శివయ్యకు జలాభిషేకం చేశారు. మంగళవారం ఉదయం మహిళలంతా బహుదానది నుంచి కలశాలతో తెచ్చిన నీటితో పూజారులు శివలింగానికి అభిషేకం చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరినారు మడులు ఎండిపోతున్న నేపథ్యంలో ఈ అభిషేకం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

హైవే సిబ్బందికి అవగాహన



ప్లకార్డులతో హైవే సిబ్బంది

కాశీబుగ్గ: ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలాస మండలం లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవీ రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో మచ్చ మాధవరావు, ఎం.హషన్ నుల్లి తదితరులు పాల్గొన్నారు.

పలాసపురంలో వైద్య శిబిరం

సోంపేట: మండలంలోని పలాపురంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి పి.సత్యనారాయణ పర్యవేక్షించారు. సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ తడక జోగారావు, కొర్లాం వైద్యాధికారి బి.సౌజన్య, వైద్యసిబ్బంది శివ, హిమంత్ తదితరులు పాల్గొన్నారు.